క్లుప్తంగా

యువత పొగాకుకు దూరంగా ఉండాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: యువత పొగాకుకు దూరంగా ఉండాలని హెచ్ఎం బలగ వెంకటరావు సూచించారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సిగరెట్లు, గుట్కా, ఖైనీ వంటి పొగాకు ఉత్పత్తులు వల్ల ఊపిరితిత్తులు, క్యాన్సర్‌తో పాటు ఇతర అనేక వ్యాధులబారిన పడతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తమ్మినేని చందనరావు, టి.జయరాం, శివప్రసాద్, ప్రసాదరావు, రామకృష్ణ, నాయుడు, దాలినాయుడు, ప్రమీల, అంజనీ బాయి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



గంగాధర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న పిరియా విజయ

సోంపేట: పట్టణానికి చెందిన పర్యావరణ పరిరక్షణ సంఘ నాయకుడు, వైఎస్సార్‌సీపీ అభిమాని గంగాధర్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబాన్ని జెడ్పీ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ బుధవారం పరామర్శించారు. ఆమెతో పాటు ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, ఎంపీటీసీ బొమ్మిడి ధర్మారావు, వార్డు మెంబర్లు తోట డిల్లీ, రంగా తదితరులు ఉన్నారు.

రూ.లక్షకు గజలక్ష్మి అమ్మవారి చీర వేలంపాట



వేలంపాటలో దక్కించుకున్న చీరతో గాయత్రి బిసాయి తదితరులు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి రత్తకన్న గ్రామంలో గజలక్ష్మి అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి చీర వేలంపాట నిర్వహించగా రూ.1,02,000లు పలికింది. గడిచిన తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఉత్సవాల అనంతరం, అమ్మవారి నిమజ్జనం సందర్భంగా బుధవారం వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన డిల్లీ బిసాయి, గాయత్రి బిసాయి దంపతులు అమ్మవారి చీరను వేలంపాటలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ వ్యవస్థ సమస్యను రోటరీ క్లబ్ ద్వారా పరిష్కరించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ సర్వీస్ డైరెక్టర్ శ్యాముల్ విక్టర్ అన్నారు. స్థానిక రోటరీ ఫంక్షన్ హాల్‌లో స్థానిక రోటరీ క్లబ్ సభ్యులతో ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ ప్రాజెక్టు డైరెక్టర్ డా.మోహన్ రాణో, డా.యు.శేషయాదవ్, మోహన్ వెంకటేష్, కాళ్ల జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

కష్టాల కస్తూర్బా



- కొత్తపాలేం కేజీబీవీని వెంటాడుతున్న సమస్యలు
- నేలపైనే విద్యార్థినుల చదువులు
- వర్షపు నీటి నిల్వలతో అవస్థలు

కవిటి: మండలంలోని కొత్తపాలేం గ్రామంలో ఉన్న కేజీబీవీని సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ విద్యాలయంలో 257 మంది బాలికలు ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్(సీఈసీ) వరకు విద్యనభ్యసిస్తున్నారు. తరగతుల నిర్వహణ, బోధన వరకు పరిస్థితి బాగానే ఉన్నప్పటికీ.. మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా తరగతుల్లో కూర్చునేందుకు బెంచీలు లేకపోవడంతో నేలపైనే చదువుతున్నారు. తరగతి గదులకు ఉన్న కిటికీలు సాధ్యమైనంతవరకు ఎప్పుడూ మూసుకోక తప్పనిపరిస్థితి నెలకొంది. ఈ కేజీబీవీ పల్లపు ప్రాంతంలో నిర్మాణం చేపట్టడం వలన వర్షపు నీరు ఏడాది పొడవుగా నిల్వ ఉంటోంది. ఫలితంగా దోమలకు ఆవాసాలుగా మురుగు నీటి నిల్వలు మిగిలిపోతున్నాయి. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంది. వర్షం కురిసే సందర్భంలో పాఠశాల మైదానం కొలనులా మారుతుండడంతో మోటార్లు పెట్టి బయటకు నీటిని తరలించడం తప్పడం లేదు. ఇక నిత్యం పరిసరాల నుంచి దుర్గంధం వెదజల్లుతుండడంతో ఉపాధ్యాయినులు సైతం అవస్థలు పడడం మినహా ఏమీ చేయలేని దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి.



పాఠశాల ఆవరణలో మురుగు నీటి కొలను



విద్యాలయం మైదానంలో నిలిచిన వర్షపునీరు

వేధిస్తున్న తరగతి గదుల కొరత

ఈ విద్యాలయంలో తరగతి గదులు అవసరమైన మేర లేకపోవడంతో తరగతుల నిర్వహణకు ఆటంకంగా మారింది. దీంతో వరండాల్లో క్లాసులు చెబుతున్నారు. డైనింగ్ రూమ్ చిన్నది కావడం, డార్మెట్రీ లేకపోవడం వలన తరగతి గదులే డైనింగ్ రూమ్ కమ్ డార్మెట్రీగా సర్దుబాటు చేసుకుంటున్నారు. కానీ ఇక్కడ తనిఖీలకు వచ్చే అధికారుల కళ్లకు ఈ సమస్యలు కనిపించకపోవడం బాధాకారం. రికార్డుల్లో సంతకాలు పెట్టేసి విద్యార్థినులతో మాట్లాడి వెళ్లిపోవడం మాత్రమే జరుగుతోంది. అందువలన ఇప్పటికైనా కేజీబీవీకి ఉండాల్సిన మౌలిక వసతులు పరిపూర్ణంగా అందించడంపై దృష్టి సారించాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు. జిల్లా న్యాయసేవాప్రాధికార సంస్థ పెద్దలు ఈ కేజీబీవీని ఒకసారి సందర్శిస్తే ఇక్కడ చదువుతున్న బాలికలు పరిస్థితి, వారి దీనావస్థ వాస్తవంగా కళ్లకు కట్టినట్టు తెలుస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



బెంచీలు లేక నేలపైనే చదువుకుంటున్న విద్యార్థినులు

ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం



పాఠశాలలో బోధనపరంగా అత్యున్నత ఫలితాలు సాధిస్తున్నాం. ఉన్న మేరకు మెరుగైన సౌకర్యాలనే పిల్లలకు కల్పించడంలో శాయశక్తులా కృషి చేస్తున్నాను. మా సిబ్బంది కూడా లోపం తలెత్తకుండా విధులు చేపడుతున్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాను.

– పి.లక్ష్మీదేవి, ప్రిన్సిపాల్, కేజీబీవీ, కొత్తపాలేం

ఇలాంటి దుస్థితి బాధాకరం



మా కొత్తపాలెం మత్స్యకార గ్రామం అభ్యుదయ భావాలు కలిగిన ఊరు. మా ఊరులో ఉన్న కేజీబీవీ పాఠశాలలో నెలకొన్న సమస్యలు అత్యంత బాధాకరం. ఉన్నతాధికారులు, పాలకులు ఈ సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. మురుగు నీటి సమస్యను పరిష్కరించాలి. బెంచీలపై కూర్చొని విద్యనభ్యసించే ఏర్పాట్లు చేయాలి. నిద్రపోయేందుకు మంచి బెడ్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

– సూర్ని లచ్చయ్య, కొత్తపాలేం, గ్రామపెద్ద

ప్రైవేటీకరణపై తిరుగుబాటు

రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరణ చేయాలని తీసుకున్న నిర్ణయంపై తిరుగుబాటు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రైవేటీకరణతో పేదలకు వైద్య విద్య దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



కవిటి: బి.గొనపపుట్టుగలో కోటి సంతకాల సేకరణలో పిరియా విజయ, పిరియా సాయిరాజ్ తదితరులు



వజ్రపుకొత్తూరు: ఉద్దానం గోపినాథపురంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం



టెక్కలి: శాసనాంలో కోటి సంతకాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న పేరాడ తిలక్ తదితరులు

ఆక్రమణల చెరలో శ్మశానవాటిక

- అంతిమ సంస్కారాలకు అవస్థలు
- పట్టించుకోని అధికారులు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీలో పాత జాతీయ రహదారికి ఆనుకుని పలాసకు వెళ్లే దారిలో ఉన్నటువంటి శ్మశానవాటిక ఆక్రమణలకు గురవుతోంది. పట్టణానికి శివారు ప్రాంతంలో ఉన్నటువంటి ఈ శ్మశానవాటిక ఆక్రమణలకు గురవుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. రోడ్డుకు ఇరువైపులా ఇదివరకు సుమారు 2 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. రోజు రోజుకూ విస్తీర్ణం తగ్గిపోయి చివరికి ఖననం చేయడానికి కూడా ఇబ్బందులు పడే స్థితికి చేరుకుంది. టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో అత్యధిక శాతం వీధుల్లో ఉన్న వారంతా వారి కుటుంబంలో ఎవరైనా మృతి చెందితే వారికి ఈ శ్మశానవాటికలోనే ఖననం చేస్తుంటారు. ఒకప్పుడు ఎంతో విస్తీర్ణం కలిగిన ఈ కర్మభూమి ఇప్పుడు పూర్తిగా బక్కచిక్కిపోయింది. దీంతో ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు, పంచాయతీ యంత్రాంగం స్పందించి ఈ శ్మశానవాటికలో ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



ఆక్రమణలకు గురవుతున్న శ్మశానవాటిక

పట్టించుకోవడం లేదు



చేరీవీధి శివారు ప్రాంతంలో పాత జాతీయ రహదారికి ఆనుకుని ఉన్నటువంటి శ్మశానవాటిక పూర్తిగా ఆక్రమణదారుల చేతిలో చిక్కిపోయింది. దీనిపై అధికారులు కనీసం దృష్టి సారించడం లేదు. భవిష్యత్‌లో శ్మశానవాటిక పూర్తిగా లేకపోయినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. ఇప్పటికైనా అధికారులు మేల్కొంటే మంచిది.

– డి.ధర్మారావు, వార్డు సభ్యుడు, టెక్కలి మేజర్ పంచాయతీ

క్రాకర్స్ అమ్మితే చర్యలు తప్పవు

సోంపేట: ప్రభుత్వ అనుమతులు లేకుండా దీపావళి పండగ పురస్కరించుకొని క్రాకర్స్ అమ్మితే చర్యలు తప్పవని ఎస్ఐ వి.లోవరాజు హెచ్చరించారు. పట్టణంలోని పెద్ద పల్లివీధిలో ఎటువంటి అనుమతులు లేకుండా దీపావళి క్రాకర్స్ విక్రయిస్తున్న డిల్లీ అనే వ్యక్తి వద్ద నుంచి సుమారు రూ.లక్ష విలువ చేసే మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు అనుమతులు లేకుండా క్రాకర్స్ తయారు చేయడం, నిల్వ ఉంచడం, విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బాణసంచా

జాబ్‌మేళా నేడు

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివీస్ లేబరేటరీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో భాగంగా డిగ్రీలో కెమిస్ట్రీ సబ్జెక్టును పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని వెల్లడించారు. ఆసక్తి కలిగిన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు కళాశాలకు హాజరవ్వాలని సూచించారు.

ఆర్థిక సాయం అందజేత

టెక్కలి: స్థానిక ఎన్టీఆర్ కాలనీ 9వ వీధికి చెందిన ప్రధానో గణపతి ఇటీవల మృతి చెందడంతో, స్థానిక కాలనీ ప్రజలు మృతుని కుటుంబానికి అండగా నిలిచారు. కాలనీ వాసులంతా విరాళాలు సేకరించి మృతుని కుటుంబానికి రూ.21,400ల ఆర్థిక సాయం బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కనకరాజు, శ్రీను, రాజబాబు, ఈశ్వరరావు, గోపి, యుగంధర్, లక్ష్మణ, శంకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని కొత్తపుట్టుగలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న యువకుడు నేతాజీకి స్థానిక ఏపీజే అబ్దుల్ కలాం ఫౌండేషన్ సంస్థ ఆపన్న హస్తం అందించింది. ఈ మేరకు బాధితుడికి వైద్య ఖర్చుల నిమిత్తం సంస్థ సేకరించిన రూ.12,000 ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. బాధితుడికి ధైర్యాన్ని చెబుతూ ఎప్పటికీ తమ సంస్థ తరపున సహకారం ఉంటుందని తెలిపారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని దేవునల్తాడ గ్రామానికి చెందిన మత్స్యకారుడు బుడగట్ల చిన బాబు ఇటీవల చేపల వేటకు వెళ్లి పడవ ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో వారి కుటుంబానికి గ్రామానికి చెందిన గుంటు విజయ్ సోదరులు రూ.10 వేల ఆర్థిక సాయం బుధవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బూత్ కన్వీనర్ సీదిరి చిరంజీవి, ఎంపీటీసీ సభ్యుడు సొదాల వెంకన్న, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, గ్రామ పెద్దలు అప్పోజి, రామారావు పిల్ల తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ఆదర్శనీయుడు అబ్దుల్ కలాం

దేశ ప్రజలందరికీ మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఏపీజే అబ్దుల్ కలాం ఆదర్శనీయుడని వక్తలు పేర్కొన్నారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



సంతబొమ్మాళి: అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఇచ్ఛాపురం రూరల్: జ్యోతులతో నివాళులర్పిస్తున్న ఎం.తోటూరు విద్యార్థులు



కంచిలి: బూరగాం హైస్కూల్‌లో కలాం విగ్రహానికి నివాళులు



కవిటి: పెద్ద ఎర్రగోవిందపుట్టుగలో నివాళులర్పిస్తున్న చిన్నారులు



పలాస: కలాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న న్యాయమూర్తి మాధురి తదితరులు

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

సాక్షి ఎఫెక్ట్...

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బాలకృష్ణాపురం పంచాయతీ పరిధి డెప్పూరు దళిత గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదంటూ సాక్షి దిన పత్రికలో గత నెల 15వ తేదీన 'పాలకులకు పట్టని డెప్పూరు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఇచ్ఛాపురం నియోజకవర్గ దళిత సంఘం నేతల డెప్పూరు సమస్యను మానవ హక్కుల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో గ్రామానికి రూ.49 లక్షలతో రోడ్డు మంజూరు చేస్తున్నట్లు అప్పటి ఇన్‌చార్జి ఎంపీడీవో కె.రామారావు తెలిపారు. అయితే సర్పంచ్ ప్రతినిధి లోహిదాసు కృషి మేరకు అదనంగా మరో రూ.26 లక్షలతో కలిపి మొత్తం రూ.75 లక్షలు మంజూరైనట్లు బుధవారం తెలిపారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

పలాస: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా బ్రాంచి ఆధ్వర్యంలో పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా శాఖ మేనేజరు సత్యనారాయణ మాట్లాడుతూ గుండెపోటు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సకాలంలో సీపీఆర్ చేయడం వలన చాలా ఉపయోగకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.నరసింహమూర్తి, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారులు కొండల మధుబాబు, తమ్మినేని వాసుదేవరావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

నందిగాం: రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని రాగోలు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత డాక్టర్ ఎం.శ్రీనివాస్ సూచించారు. మండలంలోని నందిగాం, లఖిదాసుపురం గ్రామాల్లో ఆత్మ మరియు ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పంటలో ఎరువుల యాజమాన్యం, పురుగు మందుల యాజమాన్యం గురించి రైతులకు తెలియజేశారు. దోమపోటు ఉధృతి లేకుండా ఉండేందుకు కాలిబాటలు తీసుకోవాలని, అవసరం మేరకు మాత్రమే పురుగు మందులు వినియోగించాలని, వరికి పోటాష్ రెండుసార్లు వేయాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం వ్యవసాయాధికారి వై.సురేష్, మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్‌వర్మ, వీఏఏలు పాల్గొన్నారు.

రైల్వే ఆర్‌యూబీ పనులు ప్రారంభించండి

ఇచ్ఛాపురం/కంచిలి: ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ సమీపంలోని రత్తకన్న రోడ్‌లో ఉన్న ఎల్‌గేట్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ) పనులను వేగవంతంగా ప్రారంభించాలని జెడ్ఆర్‌యూసీసీ సభ్యులు కోరారు. ఈ మేరకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే డీఆర్ఎం అలోక్ త్రిపాఠిని ఖుర్దా డీఆర్ఎం కార్యాలయంలో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్‌సీ గేట్ వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి వివరించారు. ఇచ్ఛాపురం, సోంపేట, జాడుపూడి, బారువ, మందస స్టేషన్లలో ఎక్కువ రైళ్లను నిలుపుదల చేయాలని కోరారు. సోంపేట స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అదనపు రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో జెడ్ఆర్‌యూసీసీ సభ్యులు శ్రీనివాస రాణో, సదానంద రాణో, వాసు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులకు తీవ్రగాయాలు

కంచిలి: మండలంలోని పెద్దకొజ్జిరియా గ్రామ జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీ, కొడుకులు తీవ్రగాయాలపాలయ్యారు. కవిటి మండలం పొందూరుపుట్టుగ గ్రామానికి చెందిన తండ్రీ, కొడుకులు దూగాన రమణమూర్తి, దూగాన ప్రణయకుమార్‌లు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో దూగాన రమణమూర్తి తలకు తీవ్రగాయమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతని కుమారుడు దూగాన ప్రణయ్‌కుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు 108 వాహనంలో చికిత్స కోసం సోంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారు. స్థానిక ఎస్ఐ పి.పారినాయుడుకు సమాచారం అందడంతో పరిస్థితిని సమీక్షిస్తున్నారు. అవసరమైన చర్యలు చేపడుతున్నారు.

ఎన్నాళ్లీ.. నరకయాతన..?



బురదమయంగా ఉన్న కమలాయిపుట్టుగ నుంచి రాజపురం వెళ్లే రహదారి



చెరువును తలపిస్తున్న లొండపుట్టుగ నుంచి బలరాంపురం జంక్షన్‌కు వెళ్లే రోడ్డు

- అధ్వానంగా కమలాయిపుట్టుగ రోడ్డు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు

ఇచ్ఛాపురం రూరల్: అధికారంలోకి వచ్చాక పల్లె పండగ పేరుతో కూటమి నాయకులు చేసిన హడావుడి ప్రకటనలకే పరిమితమైంది. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లో ఎటువంటి మార్పులు కనిపించడం లేదు. ఇచ్ఛాపురం, కవిటి మండలాల జంట గ్రామాలు కమలాయిపుట్టుగ, లొండపుట్టుగ, ఇచ్ఛాపురం మండలం ఎ.బలరాంపురం గ్రామాలకు వెళ్లేందుకు రహదారులు అధ్వానంగా మారడంతో ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. వాస్తవానికి స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ 2019 ఫిబ్రవరిలో ఏఐఐబీ నిధులు రూ.119.04 లక్షలతో 16వ నంబర్ జాతీయ రహదారి నుంచి లొండపుట్టుగ వరకు 1.53 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. అదేవిధంగా రాజపురం నుంచి కమలాయిపుట్టుగ వరకు రూ.1 కోటితో తారురోడ్డు నిర్మాణానికి 2018లో శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన వరుసగా గెలిచినప్పటికీ రోడ్డు కోసం శిలాఫలకం వేసున్నామన్న సంగతిని మరిచిపోయారు. దీంతో ఆ రహదారులు బురదమయంగా మారి చెరువులను తలపిస్తున్నాయి. రాజపురంలో మోడల్ స్కూల్, ప్రభుత్వ ఆస్పత్రి, ఇచ్ఛాపురం వైపు రైల్వే స్టేషన్, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, ఇంటర్, డిగ్రీ కళాశాలలతో పాటు బ్యాంకులకు వెళ్లేందుకు మూడు గ్రామాల ప్రజలకు ఈ రోడ్డే ఆధారం. ప్రస్తుతం ఎమ్మెల్యే అశోక్ ప్రభుత్వ విప్ కావడంతో ఇప్పటికైనా రహదారి నిర్మాణాలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

శిలాఫలకాలే కనిపిస్తున్నాయి



మా గ్రామాలకు సరైన రోడ్లు లేకపోవడంతో అత్యవసర సమయాల్లో 108, 104 వాహనాలు రావడం ఇబ్బందికరంగా మారుతోంది. బ్యాంకులు, పాఠశాలలు, ఆస్పత్రులకు వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్లు పేరిట వేసిన శిలాఫలకాలు మాత్రం దిష్టిబొమ్మల్లా కనిపిస్తున్నాయి.

– రాంపత్ని చిట్టిబాబు, కమలాయిపుట్టుగ

రోడ్డు వేసి పుణ్యం కట్టుకోండి



దశాబ్దాల నుంచి మా గ్రామాలకు సరైన రోడ్డు సదుపాయం లేకుండా పోయింది. ప్రభుత్వాలు ఎన్ని మారుతున్నా.. పాలకులు మారుతున్నా మా గ్రామానికి రోడ్డు మాత్రం వేయడం లేదు. వర్షాకాలం వస్తే చాలు ఉన్న కంకర రోడ్లు బురదమయంగా మారి చెరువులను తలపిస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి మా గ్రామాలకు రోడ్లు వేసి పుణ్యం కట్టుకుంటే సంతోషం.

– సాడి యాదవరావు, లొండపుట్టుగ, ఇచ్ఛాపురం మండలం

ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్

టెక్కలి: ఎన్‌సీసీ శిక్షణతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని 14వ ఆంధ్రా బెటాలియన్ కమాండెంట్ అధికారి, లెఫ్టినెంట్ కల్నల్ శాంక్ కుశ్వహ వెల్లడించారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఎన్‌సీసీ ఎంపికలు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఎంపికల్లో భాగంగా లెఫ్టినెంట్ కల్నల్ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థులకు ఎన్‌సీసీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ బల్వంత్‌సింగ్, బగిచాసింగ్, సీహెచ్ఎం రవికృష్ణ, హవల్దార్ అన్నం ప్రతాప్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఏఎస్ శ్రీనివాసరావు, కో–ఆర్డినేటర్ డి.విష్ణుమూర్తి, టి.మురళీమోహన్, ఎన్.భుజంగరావు, ఎస్.రామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌సీసీ ఎంపికల్లో పాల్గొన్న ఆంధ్రా బెటాలియన్ కమాండెంట్ అధికారులు